క్లుప్తంగా

యాత్ర విజయవంతం కావాలని పూజలు

చిట్యాల: ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టనున్న భారత్ జోడో న్యాయ యాత్ర విజయవంతం కావాలని చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలోని శివాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, అమలనగంటి అంజనేయులు, ఎదుల్ల అజిత్‌రెడ్డి, ఏర్పుల నర్సింహ, బైరబోని బిక్షం, ఏర్పుల క్రిష్ణ పాల్గొన్నారు.

పరిశ్రమల విస్తరణను నిలిపివేయాలి



పర్యావరణ పరిరక్షణ సమితి ప్రచార పోస్టర్ విడుదల చేస్తున్న సభ్యులు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు, పిట్టంపల్లి, పేరేపల్లి పరిసరాల ప్రాంతాలలో నివాస గృహాలకు దగ్గరగా ఉన్న కాలుష్యకారక పరిశ్రమల విస్తరణను నిలిపివేయాలని కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు బిల్లపాటి లింగారెడ్డి కోరారు. చిట్యాల మండలం పిట్టంపల్లిలో ఆదివారం కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ సమితి ప్రచార పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఎంపీఎల్ పరిశ్రమ విస్తరణ నిలిపివేయాలని కోరుతూ రాష్ట్ర, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఊడుగు లింగస్వామి, సలహాదారుడు ఐతరాజు శ్రావణ్, కోశాధికారి నర్మెట్ట అంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

శాలిగౌరారం: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. శాలిగౌరారం మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన శెట్టిపల్లి రాంరెడ్డి(49) గ్రామ శివారులోని కంకరమిల్లులో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగ కోసమని మేకలను కొనుగోలు చేసేందుకు ఆదివారం రాత్రి మండలంలోని ఊట్కూరు గ్రామానికి బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అడ్లూరు శివారులో మోపెడ్‌పై ఎదురుగా వస్తున్న మండలకేంద్రానికి చెందిన పంపాటి నాగరాజును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాంరెడ్డికి బలమైన నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాంరెడ్డి మృతిచెందాడు. మృతుడి భార్య కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్దకుమార్తె వివాహం నిశ్చయం కాగా ఫిబ్రవరిలో వివాహం చేసేందుకు సిద్ధమవుతున్నాడు.

ధ్వజ స్తంభం ఏర్పాటుకు రూ.3.10లక్షల విరాళం

మునుగోడు: మండల కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో ధ్వజ స్తంభం ఏర్పాటు చేసేందుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్‌నేత రూ.3.10లక్షల విరాళాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కైలాస్ నేత దంపతులని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు కొంగరి కృపానందం, మిర్యాల మధుకర్, మిర్యాల శ్రీనివాస్, వెంకటేషం, సంగిశెట్టి పరమేష తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న డాక్టర్ పుల్లారావు

నల్లగొండ టౌన్: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని డాక్టర్ పుల్లారావు అన్నారు. ఆదివారం భోగి, వెంకటేశ్వర్లు-కొండమ్మల మనుమరాలు నాగ హరిణి జన్మదిన వేడుకల సందర్భంగా నల్లగొండ పట్టణంలోని మదర్ థెరిసా హోమ్‌లో వృద్ధులు, మానసిక దివ్యాంగులకు అన్నదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ మెంబర్ పసల శౌరయ్య, మదర్ థెరిసా సిస్టర్స్ రమ్య, గ్రమేస్ మారి, ఎల్‌వీ.అలెన్‌మేరీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

మునుగోడు: సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం మునుగోడులోని సెయింట్ జోసఫ్ పాఠశాల మైదానంలో జెడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణిరవి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. పోటీలో పాల్గొనాలనుకునే మహిళలు 9666066237 నంబర్‌కి ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకొని మధ్యాహ్నం 12 గంటలకు పాఠశాల మైదానానికి రావాలని నిర్వాహకులు సూచించారు. విజేతలకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

అంబరాన్నంటిన భోగి సంబరాలు



నల్లగొండ పట్టణంలో భోగి వేడుకల్లో నృత్యాలు చేస్తున్న ప్రజలు



నల్లగొండలోని ధాత్రినగర్‌లో భోగి మంటలు వేస్తున్న కాలనీవాసులు

రామగిరి (నల్లగొండ): జిల్లా వ్యాపంగా భోగి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన భోగి మంటల కార్యక్రమానికి కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళలు ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించి నృత్యాలు చేశారు. భోగి మంటల్లో పాల్గొన్న వారికి వివిధ రకాల పిండి వంటకాలను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఖయ్యూం బేగ్, అభిమన్యు శ్రీనివాస్, ఉట్కూరు వెంకట్‌రెడ్డి, బొజ్జ మల్లికానాగరాజు, రావిరాల పూజితావెంకటేశ్వర్లు, దాసరి సాయి, గుర్రం ధనలక్ష్మీవెంకన్న, ఐబీసీ ఛానల్ ఎండీ ఏచూరి భాస్కర్‌శైలజా, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ పుల్లారావు, పసల శౌరయ్య, నిమ్మల భీమార్జున్‌రెడ్డి, డాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ధాత్రినగర్‌లో..

నల్లగొండ పట్టణంలోని ముశంపల్లి రోడ్డులో గల ధాత్రినగర్‌లో ఆదివారం భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాలనీవాసులంతా భోగి మంటలు వేసుకున్నారు. అనంతరం మహిళలు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు మేరెడ్డి భిక్షంరెడ్డి, చిర్రా రాంరెడ్డి, మేకా వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సతీష్, ఎల్లయ్య, రమేష్, శ్రీరాములు, రాంబాబు పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: లెప్రసీ కాలనీ చిన్నారుల మధ్య సంక్రాంతి పండుగను జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆర్యన్స్ యోగ, ఫిట్నెస్ సెంటర్ గురూజీ సంధ్య అన్నారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా లెప్రసీ కాలనీలోని చిన్నారులకు పతంగులు మిఠాయిలు పంపిణీ చేసి అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి కోశాధికారి చొక్కరపు మాధవి, ఆర్కే ప్రదీప్, సేవా భారతి కోఆర్డినేటర్ భీమనపల్లి శ్రీకాంత్, స్రవంతి, నాగమణి, బ్రహ్మం, గౌతమ్ ఆర్యన్, సిద్ధార్థ, ఆర్యన్, గణేష్, చిన్న పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి: భోగి మంటలు వేస్తున్న ప్రజలు

వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల..

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో గల తన నివాసంలో ఆదివారం భోగి సంబరాల్లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, చీరా పంకజ్‌యాదవ్, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, పూజిత శ్రీనివాస్, యామా దయాకర్‌రావు, భువనగిరి దేవేందర్ పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల: పట్టణంలోని ఐదో వార్డులో కౌన్సిలర్ జడల పూలమ్మ ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. అదేవిధంగా చిట్యాల మండలంలోని వెలిమినేడులో గ్రామస్తులు భోగి వేడుకలు నిర్వహించారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి: మండలంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఆదివారం తెల్లవారుజామున ప్రజలు భోగి మంటలు వేశారు. మహిళలు, చిన్నారులు ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్: భోగి పండుగ సందర్భంగా ఆదివారం నకిరేకల్ పట్టణంలోని వెంకటేశ్వర, ఐశ్వర్య సాయి, శివాలయం, గీతా మందిరం, కనకదుర్గ దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీధుల్లో గంగిరెద్దులు ఆట నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు తమ స్వగృహం ముందుకు వచ్చిన గంగిరెద్దులకు కానుకలు సమర్పించారు.



నకిరేకల్: గంగిరెద్దులకు కానుకలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే వీరేశం దంపతులు

మునుగోడులో..

మునుగోడు: మండల వ్యాప్తంగా ఆదివారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. వివిధ కాలనీల ప్రజలు ఆయా కాలనీల్లో భోగి మంటలు వేశారు. మహిళలు రంగురంగుల ముగ్గులువేసి గొబ్బెమ్మలు పెట్టారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో..

కేతేపల్లి: భోగి పండుగ సందర్భంగా ఆదివారం కేతేపల్లి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మహిళలు, యువతులు ఆదివారం వేకువజామునే తమ ఇళ్ల ముంగిట ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. చిన్నారులు భోగి పళ్ల పోసి ఆశీర్వదించారు. దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్: భోగి పండుగను మండల ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, చిన్నారులు తమ ఇళ్ల ముందు రంగవల్లులను తీర్చిదిద్దారు. కట్టంగూర్ మండల కేంద్రంలోని లక్ష్మీ నారాయణ దేవస్థానంలో పూజారి శ్రీరామడుగు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో గోదాదేవి రంగనాథస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో భోగి మంటలు వేశారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం: మండలంలో భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు మహిళలు, యువతులు ముగ్గులు వేసి వీధులను రంగులమయంగా మార్చారు. గంగిరెద్దుల విన్యాసాలు అలరించాయి. చిన్నారులు పతంగులు ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు. యువత క్రీడాపోటీలతో గ్రామాలు సందడిగా మారాయి.



నల్లగొండ టౌన్: లెప్రసీ కాలనీలో చిన్నారులకు పతంగులు అందజేస్తున్న సంధ్యా గురూజీ



మునుగోడు: భోగి మంటలు వేస్తున్న ప్రజలు



నల్లగొండలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు



నల్లగొండ పట్టణంలో ముగ్గు వేస్తున్న మహిళలు



నల్లగొండ: హరిదాసుకు బియ్యం పోస్తున్న మహిళలు



కట్టంగూర్: హరిదాసుతో ప్రజలు



కేతేపల్లి: ముగ్గు వేస్తున్న యువతి



నల్లగొండలోని తన నివాసం వద్ద భోగి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



నల్లగొండలో భోగి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



చిట్యాల: భోగి మంటలు వేస్తున్న ప్రజలు

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి కోమటిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు

నల్లగొండ: తెలంగాణ క్లస్టర్ రీసోర్స్‌పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆదివారం నల్లగొండలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీసీఆర్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాసు సంతోష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పగిడిపాటి ప్రవీణ్, హమీద్, అజీం పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



పద్మశాలీ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి

నల్లగొండ: తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంజి వెంకట శ్రీనివాస్, మిర్యాల వెంకటపతి, శ్రీనివాస్‌కుమార్, జ్ఞానేశ్వర్, రాపోలు రవి, సంగిసెట్టి హరికృష్ణ, నీలం సుధాకర్, వేసాల శ్రీదేవి, శ్రీకాంత్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ క్యాలెండర్

రామగిరి (నల్లగొండ): జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, రాష్ట్ర గౌరవ సలహాదారుడు పున్న రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, గౌరవ సలహాదారులు కంది సూర్యనారాయణ, జిల్లా సభ్యులు వెంకట్, చానాల రాంరెడ్డి, ముశం లక్ష్మణ్, వెంకట్‌యాదవ్ పాల్గొన్నారు.



ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి

మహిళలకు ముగ్గుల పోటీలు



శాలిగౌరారం: బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ రణీల, లయన్స్ క్లబ్ ప్రతినిధులు



మర్రిగూడ: విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ నల్ల యాదయ్య

శాలిగౌరారం: సంక్రాంతి పండుగ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ ఆర్థిక సహకారంతో శాలిగౌరారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన మహిళలకు జెడ్పీటీసీ ఎర్ర రణీల, లయన్స్ క్లబ్ జిల్లా ప్రథమ వైస్ గవర్నర్ యారాల ప్రభాకర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కోడె సతీష్, రావిరాల అశోక్, ఎర్ర శంభులింగారెడ్డి, బుడిగె శ్రీనివాసులు, మారం వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జైభీమ్ సాహో యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి ఐతగోని విజయ, రెండో బహుమతి అక్షిత, మూడో బహుమతి పావని గెలుపొందారు. విజేతలకు సర్పంచ్ నల్ల యాదయ్య బహుమతులు అందజేశారు. అనంతరం జైభీమ్ సాహో యూత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు ఈద గిరీశ్వర్, తుప్పరి శ్రీనివాస్, సూర్యనారాయణ, వీరమళ్ల లోకేష్, గ్యార యాదగిరి, జాజాల రామకృష్ణ, పగడాల రఘు, చలగోని వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గు..



నల్లగొండ పట్టణంలోని లెప్రసీ కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో కుష్టు వ్యాధిగ్రస్తురాలు సుమిత్ర తన రెండు చేతులకు వేళ్లు లేకున్నా అందమైన ముగ్గు వేసి ఆకట్టుకుంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ఆర్థికసాయం అందజేత

నకిరేకల్: మండల పరిధిలోని చందుపట్ల గ్రామపంచాయతీకి చెందిన దుస్స పరమేశ్వరి భర్త చనిపోవడంతో ఆమె తన తల్లి వద్దే ఉంటోంది. ఆమెకు మానసిక వికలాంగురాలైన చెల్లెలు కూడా ఉంది. పరమేశ్వరి తండ్రి కూడా మృతిచెందడంతో కుటుంబ భారం మొత్తం పరమేశ్వరి, ఆమె తల్లిపై పడింది. వీరి దీనగాథపై డిసెంబర్ 11న 'పేద కుటుంబాన్ని ఆదుకోరూ..' అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందిస్తూ.. పరమేశ్వరితో పాటు 1996–97లో చందుపట్లలో పదో తరగతి చదువుకున్న ఆమె స్నేహితులు ఆదివారం రూ.28,500 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అల్లి సైదులు, కోట్ల సాగర్, జిల్లా కరుణాకర్, రమాదేవి, స్వప్న, సునీత, ఉపేంద్రచారి పురుషోత్తం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి రంగనాథస్వామి కల్యాణోత్సవం



నల్లగొండలోని రామాలయంలో కల్యాణంలో భాగంగా తాళి చూపిస్తున్న అర్చకులు



రామాలయంలో గోదాదేవి కల్యాణం తిలకించేందుకు వచ్చిన ప్రముఖులు

రామగిరి (నల్లగొండ): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నల్లగొండలోని రామగిరి సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సబిత దంపతులు స్వామివారికి నూతన పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అర్చకులు వేదాశీర్వచనం చేసి మంత్రి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అదేవిధంగా దేవరకొండ రోడ్డులోని సిద్ధార్థకాలనీలో గల వెంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన గోదాదేవి రంగమన్నారు స్వామి కల్యాణంలో మంత్రి కోమటిరెడ్డి పాల్గొన్నారు. గొల్లగూడలో గల సీతారామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో ఆలయ ధర్మకర్తలు గడ్డం లక్ష్మీకాంతరావు, విజయ, అల్లి సుభాష్‌యాదవ్ పాల్గొన్నారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, శ్రీమన్నారాయణ మాలధారులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్: మండలంలోని పాలెం గ్రామంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయక కల్యాణోత్సవంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పుష్ప దంపతులు పాల్గొన్నారు. అదేవిధంగా చందుపట్లలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, నకిరేకల్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాయంలో కూడా గోదాదేవి కల్యాణం నిర్వహించారు.

చిట్యాలలో..

చిట్యాల: మండలంలోని నేరడ గ్రామంలో గల సీతారామాంజనేయ స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడు మరింగంటి రామచంద్రాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. చెరుపెల్లి గోవర్ధన్–కృష్ణవేణి దంపతులు శ్రీసీతారామ, లక్ష్మణ, గోదాదేవి, అంజనేయస్వామి ఉత్సవమూర్తులకు వెండి కిరీటాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుబ్బాక శోభావెంకట్‌రెడ్డి, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పాపని జనార్దన్, భక్తులు పాల్గొన్నారు.

మునుగోడులో..

మునుగోడు: మండలంలోని కిష్టాపురంలో గల వేణుగోపాలస్వామి దేవాలయం ఎదుట గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసచారి, మోహన్‌రావు, దేవాలయ చైర్మన్ బోయ గాలయ్య, ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, మాజీ జెడ్పీటీసీ జాజుల అంజయ్యగౌడ్, ఉప్ప సర్పంచ్ ఆకుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.



రామాలయంలో పల్లకీ సేవను మోస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నకిరేకల్: పాలెంలో గోదాదేవి కల్యాణానికి హాజరై పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం



మునుగోడు: కిష్టాపురంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు